


జమ్మికుంట: శంభునిపల్లిలో చీరలు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ డాక్టర్ శ్రీరాం శ్యాం వీణవంక : మల్లారెడ్డిపల్లిలో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

# మహిళా అభ్యున్నతికి సర్కారు కృషి

- దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు
- ఆడబిడ్డలు బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలి
- బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు



హుజూరాబాద్‌టౌన్: ప్రతాపవాడ మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, పక్కన కౌన్సిలర్ తిరుమల్‌రెడ్డి తదితరులు

జమ్మికుంట, అక్టోబర్ 7: స్వరాష్ట్రంలో మహిళల అభ్యున్నతి కోసం సర్కారు ఎంతో కృషి చేస్తున్నదని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ఇందుకు నిదర్శనమని జడ్పీటీసీ డాక్టర్ శ్రీరాం శ్యాం పేర్కొన్నారు. శనివారం మండలంలోని శంభునిపల్లి గ్రామంలో సర్పంచ్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా జడ్పీటీసీ హాజరయ్యారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తర్వాత ఆయన మాట్లాడుతూ, మహిళలకు అన్నలా సీఎం కేసీఆర్ పంపించిన చీరలను బతుకమ్మ పండుగ రోజు కట్టుకోవాలని, వేడుకల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచాయని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో పనిచేసే ప్రభుత్వానికే పట్టంగట్టాలని, నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపతిరావు, కార్యదర్శి మధు, గ్రామాధ్యక్షుడు సదయ్య, మహిళలు రాధ, కోమల, మంజుల, ఉమ, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

**హుజూరాబాద్‌లో..**

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 7: ప్రతి ఆడబిడ్డ ఆనందంగా బతుకమ్మ పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ చీరలను కానుకగా అందజేస్తున్నారని హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ధనిక పేద తేడా లేకుండా అందరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్ సమ్మయ్య, వార్డు కౌన్సిలర్లు ప్రతాప తిరుమల్‌రెడ్డి, మక్కపెల్లి కుమార్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ కొయ్యడ కమలాకర్‌గౌడ్, మెప్మా, బల్దియా సిబ్బంది, రేషన్ డీలర్లు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**సైదాపూర్‌లో..**

సైదాపూర్, అక్టోబర్ 7: మహిళలకు పండుగ కానుకగా ప్రభుత్వం బతుకమ్మ చీరలను అందిస్తుందని ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం లస్మన్నపల్లిలో ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, వెన్నంపల్లి సింగిల్‌విండో చైర్మన్ బిల్ల వెంకటరెడ్డి, సర్పంచ్ కాయిత రాములు, సైదాపూర్‌లో సైదాపూర్ సర్పంచ్ చంద శ్రీనివాస్, ఎక్లాస్‌పూర్‌లో ఎక్లాస్‌పూర్ సర్పంచ్ కొత్త రాజిరెడ్డి మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్నివర్గాలకు సమన్యాయం చేస్తున్నదన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు చీరలను కానుకగా అందించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

**మల్లారెడ్డిపల్లిలో..**

వీణవంక, అక్టోబర్ 7: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో శనివారం ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరణలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులకు రూ.28 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పించడంతోపాటు వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పేదింటి ఆడబిడ్డలు బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలని 250 రకాల చీరలను నేతన్నలతో నేయించి, అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భిక్షపతి, వార్డు సభ్యులు , బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సైదాపూర్: లస్మన్నపల్లిలో బతుకమ్మ చీరలను పంపిణీచేస్తున్న ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి

## గుడుంబా అమ్మితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ ఆరోగ్యం

సైదాపూర్, అక్టోబర్ 7: గుడుంబా అమ్మినా, తయారుచేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ జన్ను ఆరోగ్యం హెచ్చరించారు. శనివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం గుడుంబాను నిషేధించిందని గుర్తు చేశారు. వెన్నంపల్లి గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్న మాడ రాజిరెడ్డి, నాటు సారా తయారుచేసిన వీరానాయక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి సూచన మేరకు ఇప్పటికే మండలంలోని తండాల వాసులకు గుడుంబా నిషేధంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా గుడుంబా తయారుచేసినా, అమ్మినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

## అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లోకి చేరికలు



చల్లూరులో గోపీనాథ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలకిషన్‌రావు

వీణవంక, అక్టోబర్ 7: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసే ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాల బాలకిషన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని చల్లూరు గ్రామంలో శనివారం బీజేవైఎం మండలాధ్యక్షుడు నారాయణదాసు గోపీనాథ్, 86వ బూత్ అధ్యక్షుడు గూడెపు శివ, నాయకుడు ఎదులాపురం రాములు బీఆర్ఎస్‌లో చేరగా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలకిషన్‌రావు గులాబీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో హుజూరాబాద్‌లో గులాబీ జెండా ఎగురవేయడానికి కృషి చేయాలని సూచించారు. తాము ఎన్నో ఏండ్లుగా బీజేపీలో పని చేస్తున్నామని, ఈటల రాజేందర్ చేరికతో ఆ పార్టీ నాశనం అయిందని గోపీనాథ్, శివ, రాములు తెలిపారు. అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పొదిల జ్యోతి-రమేశ్, ఎంపీటీసీ ఎలవేన సవిత-మల్లయ్య, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు కుమార్‌యాదవ్, నాయకులు దండి తిరుపతి, బొంగోని సదానందం, జీవన్‌ఫసియొద్దీన్, జక్కు నారాయణ, సంపత్‌రెడ్డి, రాజయ్య, హరీశ్, భార్గవ్, సది, రాము, రమాకుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## స్వరాష్ట్రంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

- మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు



విద్యుత్ లైన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు

జమ్మికుంట, అక్టోబర్ 7: స్వరాష్ట్రంలో వినియోగదారులందరికీ నాణ్యతతో కూడిన విద్యుత్ అందుతున్నదని, నిమిషం కోత లేకుండా సరఫరా చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ వినియోగదారుల ఫోరంలో వార్డు కౌన్సిలర్ దేశిని రాధ-సదానందం లోవోల్టేజీపై దరఖాస్తు చేసిన వెంటనే విద్యుత్ అభివృద్ధి పనులకు రూ.7లక్షలు మంజూరు చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్న-కోటి, కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో పర్యటించారు. విద్యుత్ స్తంభాలకు ఐదో విద్యుత్ లైన్ పనులను పరిశీలించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ, పనులు నాణ్యతా ప్రమాణాలతో సాగుతున్నాయని, కొత్తపల్లి ప్రజలకు లోవోల్టేజీ ఇబ్బందులు నేటితో తొలగిపోతాయని తెలిపారు. ఇక్కడ కౌన్సిలర్లు దేశిని రాధ-శ్రీనివాస్, శ్రీపతి నరేశ్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, విద్యుత్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన జాతీయ బృందం




కొండపాకలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జాతీయ బృందం

వీణవంక, అక్టోబర్ 7: మండలంలోని కొండపాక గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్ కోసం శనివారం జాతీయ నాణ్యతా ప్రమాణాల సూచిక బృందం సందర్శించింది. ఇందులో భాగంగా ఆరోగ్య కార్యక్రమాలు, రికార్డులు, జన ఆరోగ్య సమితి సమావేశాలు, సీజనల్ డిసీజ్ రికార్డులు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పరిశుభ్రత, ఆన్‌లైన్ డాటా తదితర అంశాలను బృందం పరిశీలించినట్లు వీణవంక పీహెచ్‌సీ డా.వరుణ తెలిపారు. ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్‌లో 100 మార్కులకు గానూ 70కి పైగా మార్కులు సాధించినట్లయితే జాతీయ స్థాయి ప్రశంసాపత్రం, రూ. 1.28 లక్షలు పారితోషికం అందజేస్తారని పేర్కొన్నారు. ఈ పారితోషికంలో 25 శాతం ఆరోగ్య సిబ్బందికి, 75 శాతం హెల్త్ వెల్‌నెస్ సెంటర్ అభివృద్ధికి వెచ్చించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ నాణ్యతా ప్రమాణాల సూచిక బృందం జనరల్ మేనేజర్ డా.జయప్రకాశ్, డా.అతిఇంద్ర ఉపాధ్యాయ, జిల్లా వైద్యాధికారి డా.లలితాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ డాక్టర్ వివేకానందరెడ్డి, సర్పంచ్ ఆవాల అరుంధతి-గిరిబాబు, డీపీవో తులసి రవీందర్, ఎన్‌హెచ్‌ఎం అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ శ్రీకాంత్, క్వాలిటీ మేనేజర్ సాగర్, హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, సూపర్‌వైజర్లు విజయ, శ్రీధరాచారి, టీబీ సూపర్‌వైజర్ దేవేందర్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు రాజమణి, రాజేశ్వరీ, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## యువత కష్టపడి చదవాలి

సైదాపూర్, అక్టోబర్ 7: యువత కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని రాంచంద్రాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఇటీవల కానిస్టేబుల్‌గా ఎంపికైన గ్రామానికి చెందిన కొయ్యడ గౌతమికి శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ రేగుల సుమలతాఅశోక్ ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, గౌతమి కానిస్టేబుల్‌గా ఎంపికవడం చాలా సంతోషకరమన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చాంద్‌పాషా, హెచ్‌ఎం రమేశ్, యువజన సంఘం అధ్యక్షుడు సుంకరి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



రాంచంద్రాపూర్‌లో గౌతమిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు